క్లుప్తంగా

అభయాంజనేయ ఆలయంలో ఆమంచి పూజలు



పూజలు నిర్వహిస్తున్న ఆమంచి కుటుంబ సభ్యులు

పర్చూరు (చినగంజాం): స్థానిక వై. జంక్షన్‌లోని అభయాంజనేయ స్వామి ఆలయంలో బుధవారం నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఆమంచి కృష్ణమోహన్ తన కుటుంబ సభ్యులతో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు ఆమంచి కుటుంబ సభ్యులకు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. కృష్ణమోహన్ కుమారుడు వెంకటేశ్వర్లును హైదరాబాద్‌లో ఐఏఎస్ శిక్షణలో చేర్పించేందుకు వెళుతూ మార్గమధ్యంలో పర్చూరులో ఆగి కుటుంబ సభ్యులతో కలిసి ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించి బయలుదేరి వెళ్లారు.

సీజనల్ వ్యాధులపై ప్రత్యేక చర్యలు

చీరాల టౌన్: గ్రామంలో సీజనల్ వ్యాధులకు గురికాకుండా ప్రత్యేక పారిశుద్ధ్య పనులు చేస్తున్నామని దేవాంగపురి పంచాయతీ సెక్రటరీ, ఇన్‌చార్జి ఈవోఆర్డీ మురళీబాపూజీ తెలిపారు. బుధవారం గుమస్తాల కాలనీ, కృపానగర్, హస్తినాపురం, తదితర ప్రాంతాల్లో ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాలను నిర్వహించారు.

ఉత్తమ ఉపాధ్యాయులకు సత్కారం



15 మంది ఉపాధ్యాయులను సన్మానిస్తున్న దృశ్యం

చీరాల టౌన్: ఉత్తమ ఉపాధ్యాయులుగా అవార్డులు పొందిన వారిని బత్తుల సర్వీస్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. బుధవారం స్థానిక రోటరీ కమ్యూనిటీ హాలులో 15 మందిని ఘనంగా సత్కరించారు. ట్రస్ట్ అధ్యక్షుడు బ్రహ్మారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకలకు మాజీ ఎమ్మెల్సీ కత్తి నరసింహారెడ్డి హాజరై మాట్లాడారు. సమాజానికి మార్గనిర్దేశకులు ఉపాధ్యాయులేనని, వారు అంకితభావంతో బోధనలు చేయడం వలనే ఉత్తమ పౌరులను తీర్చిదిద్దుతారన్నారు. రచయితలు వడలి రాధాకృష్ణ, ఎస్.విజయ్‌కుమార్, యల్లమందారెడ్డి, అప్పాజోస్యులు, గాదె హరిహరరావు, బాపయ్య, ఏకాంబరేశ్వరబాబు పాల్గొన్నారు.

శింగరకొండ దర్శిని



అద్దంకి: శోభకృతు నామ సంవత్సరం, దక్షిణాయనం నిజ శ్రావణ మాసంభరణి నక్షత్రం సప్తమి తిథి సందర్భంగా గురువారం ప్రత్యేక పూజలు చేస్తారని దేవస్థాన ఏసీ సుభద్ర బుధవారం తెలిపారు. ఇష్టమైన ఆకు పూజ చేస్తే కోరిన కోర్కెలు నెరవేరుతాయని చెప్పారు. ఉదయం బిందె తీర్థం, మధ్యాహ్నం 1.00 గంట నుంచి 1.30 గంట వరకు పంచ హారతుల పూజ నిర్వహిస్తారు. రాత్రి 7 గంటల నుంచి 7.45 గంటల వరకు జరిగే ప్రదోషకాలార్చన అనంతరం ఆలయం మూసివేస్తారు.

వైఎస్సార్ చేయూతకు దరఖాస్తు చేసుకోండి

బల్లికురవ: ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలోని 45 నుంచి 60 సంవత్సరాల మధ్య వయస్సు కలిగిన మహిళలకు వైఎస్సార్ చేయూతలో రూ.18750తో చేయూత నిస్తున్నట్లు ఎంపీడీవో ఈ సీహెచ్ కృష్ణ తెలిపారు. అర్హులు గ్రామ సచివాలయాల్లో దరఖాస్తు చేసుకోవాలని ఈనెల 22న తుది జాబితాతో ఈ నెలఖారులోపు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి, మహిళల ఖాతాలకు సొమ్ము జమ చేస్తారని తెలిపారు.

గోకుల కృష్ణ.. గోపాల కృష్ణ

● ఘనంగా కృష్ణాష్టమి వేడుకలు



కదవకుదురులో కృష్ణాష్టమి పూజలు నిర్వహిస్తున్న దృశ్యం



చీరాల: ప్రత్యేక అలంకరణలో కృష్ణుడికి అభిషేకాలు చేస్తున్న అర్చకులు



ఉప్పటూరు కృష్ణాలయంలో పూజలు



అద్దంకి: కృష్ణాష్టమి వేడుకల్లో ఉట్టి కొడుతున్న శ్రీకృష్ణుడి వేషధారణలు



మార్టూరులో ఉత్సాహంగా ఉట్టి కొట్టే వేడుక

చీరాల: కృష్ణాష్టమి పురస్కరించుకుని బుధవారం పట్టణం, రూరల్ గ్రామాల్లోని దేవాలయాలన్నీ శ్రీకృష్ణుని పూజలు, అలంకరణలతో కిటకిటలాడాయి. చిన్నపిల్లల కృష్ణుని అలంకరణతో పాటు ఉట్టికొట్టే వేడుకలు చేపట్టారు. దేవాలయాల అర్చకులు కృష్ణుడుకి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేపట్టారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని కృష్ణుడుని దర్శించుకున్నారు. గోశాలలో శ్రీకృష్ణాష్టమి పురస్కరించుకుని ప్రత్యేక పూజలు, భజనలు చేశారు.

బల్లికురవ: మండలంలోని కొప్పరపాలెం, మల్లాయపాలెం, ముక్తేశ్వరం, ఎస్.ఎల్ గుడిపాడు గ్రామాల్లో మందిరం ఏర్పాటుతో శ్రీకృష్ణుడి విగ్రహాన్ని పెట్టి అర్చకులచే షోడసోపచార పూజలు, అష్టోత్తర పారాయణ, తులసి దళాలతో పూజలు చేపట్టారు. కృష్ణుడికి అత్యంత ప్రీతిపాత్రమైన వెన్న, అటుకులు, బెల్లం వివిధరకాల పండ్లను నివేదించారు. కృష్ణాష్టమి మిగులు తగులతో ఉట్టికొట్టే కార్యక్రమాన్ని గురువారం నిర్వహిస్తున్నారు.

అద్దంకి రూరల్: శ్రీకృష్ణుడి జన్మదినం సందర్భంగా కృష్ణాష్టమి వేడుకలు బుధవారం అద్దంకిలోని సత్యసాయిబాబా మందిరంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులు వేసిన కృష్ణుడు, గోపికల వేషధారణలు ఆకట్టుకున్నాయి. మందిర నిర్వాహకులు ఏర్పాటు చేసిన ఉట్టి కొట్టే కార్యక్రమంలో వేషధారులైన చిన్నారులు పోటీపడి ఉట్టి కొట్టి, రంగులు జల్లుకుంటూ వసంతోత్సవాన్ని నిర్వహించారు.

జె.పంగులూరు: స్థానిక పంగులూరు మాగుంట సుబ్బరామిరెడ్డి, బాచిన నారాయణమ్మ జూనియర్ కళాశాలలో, ఎస్ఆర్ఆర్ ఖోఖో అకాడమీ ఆధ్వర్యంలో బుధవారం శ్రీ క్రిష్ణాష్టమి వేడుకలు ఘనంగా జరిగాయి. చిన్నారి శ్రీ కృష్ణుని వేషధారణంతో ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. ఉట్టి కొట్టేందుకు ఉత్సాహం చూపించారు. రాష్ట్ర ఖోఖో కార్యదర్శి మేకల సీతారామిరెడ్డి క్రీడాకారులకు శ్రీ క్రిష్ణాష్టమి శుభాకాంక్షలు తెలియచేశారు.

పర్చూరు (చినగంజాం): ఉప్పుటూరులో ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామంలోని శ్రీకృష్ణుడి విగ్రహాన్ని వివిధ రకాల పూలతో అందంగా అలంకరించారు. గురువారం గోమాత పూజలు, ఉట్టి కొట్టడం, గ్రామోత్సవం తదితర కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు అర్చకులు తెలిపారు.

మార్టూరు: కృష్ణాష్టమిని పురస్కరించుకొని బుధవారం మండలంలో వేడుకలను నిర్వహించారు. భక్తులు ఉదయం నుంచే కృష్ణాలయాలు, వైష్ణవాలయాల్లో పూజలు నిర్వహించారు. మార్టూరు బలరాం కాలనీ సమీపంలోని యాదవ వీధిలో యువకులు ఉట్టి కొట్టే ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు.

చినగంజాం: కడవకుదురు యాదవ సంఘం ఆధ్వర్యంలో కృష్ణాష్టమి పురస్కరించుకొని కృష్ణుని ఆలయంలో పూజా కార్యక్రమాలను నిర్వహించారు.



చీరాల: ప్రత్యేక పూజలకు హాజరైన భక్తులు



కొప్పరపాలెంలో మందిరం ఏర్పాటు



పంగులూరులో ఉట్టి కొడుతున్న క్రీడాకారులు

ఇంటి వద్దకే సంక్షేమ పథకాలు



సంక్షేమ పథకాల బుక్‌లెట్‌ను అందిస్తున్న వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి కరణం వెంకటేష్



సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లుకు సూచనలు అందిస్తున్న ఇన్‌చార్జి వెంకటేష్

చీరాల: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పాలనలో ఇంటి వద్దే సంక్షేమ పథకాలు అందుతున్నాయని నియోజకవర్గ ఇన్‌చార్జి కరణం వెంకటేష్ అన్నారు. గురువారం రాత్రి చీరాల మండలంలోని పాతచీరాల గ్రామ పంచాయతీలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, పార్టీ నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటేష్ మాట్లాడుతూ గ్రామంలోని అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా చూడాలన్నారు. ప్రతి కుటుంబానికి సంక్షేమ పథఖాలు అందేలా సీఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారన్నారు. రానున్న ఎన్నికల్లో ప్రజాబలంతో మళ్లీ వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని ముఖ్యమంత్రిని చేయాలని కోరారు. వలంటీర్ల ద్వారా నేరుగా లబ్ధిదారులకే సంక్షేమ పథకాలు అందుతున్నాయన్నారు. అర్హత ఉండి సంక్షేమ పథకాలు అందని వారు వార్డు సచివాలయంలో సంప్రదించాలని సూచించారు. ప్రజలకు సమస్యలేమైనా ఉంటే వాటిని కూడా సత్వరమే పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామన్నారు. నవరత్నాల పథకాలను అర్హులందరూ సద్వినియోగించుకోవాలని సూచించారు. వార్డులోని సమస్యలను ప్రజలను అడిగి తెలుసుకుని తగు పరిష్కారం చేయాలని సచివాలయ సిబ్బందికి సూచించారు. ప్రతి ఇంటికీ వెళ్లి ప్రభుత్వ అమలు చేస్తున్న సంక్షేమ పథకాల ద్వారా ఆయా కుటుంబాలకు చేకూరిన లబ్ధిని వివరించి బుక్‌లెట్‌ను అందించారు. మున్సిపల్ చైర్మన్ జంజనం శ్రీనివాసరావు, వైస్ చైర్మన్ బొనిగల జైసన్‌బాబు, ఆర్‌టీకే చైర్మన్ కావూరి రమణారెడ్డి, మున్సిపల్ కౌన్సిలర్లు, గ్రామానికి చెందిన నాయకులు అంకాలరెడ్డి, అద్దంకిరెడ్డి, ఆదినారాయణ, రాంబాబు, ప్రసాద్‌రెడ్డి, సుబ్బారావు, ఏపీఎం సుబ్బారావు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, మెప్మా సిబ్బంది పాల్గొన్నారు.

పింఛన్ అందజేత

కొత్తపట్నం: ఈతముక్కలకి పిల్లి నాగరత్నమ్మ ఊళ్లపాలెం గ్రామంలోని తన కుమార్తె వద్ద ఉంటోంది. వలంటీర్ తెలగతోటి సరిత ఊళ్లపాలెం వెళ్లి రూ.2,750 పింఛన్ అందజేసింది. సీఎం జగన్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

బాధితునికి ఆర్థిక సాయం



బాధితుడు గఫూర్‌కు నగదు, నిత్యావసరాలు అందజేస్తున్న నాయకులు

చినగంజాం: ఆపరేషన్ చేయించుకున్న వ్యక్తికి కడవకుదురు ఎంపీటీసీ ఆమంచి వెంకట సుబ్బారావు ఆ వ్యక్తిని ఆర్థికంగా ఆదుకున్నాడు. మండల కేంద్రం చినగంజాంలోని ఇస్లాంపేటకు చెందిన షేక్ గఫూర్ గత కొంత కాలంగా వెరికోస్ వీన్స్ అనే వ్యాధితో బాధపడుతున్నాడు. ఆపరేషన్ చేయించుకునే ఆర్థిక స్థోమత లేక పోవడంతో పర్చూరు నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఆమంచి కృష్ణమోహన్‌ను సంప్రదించడంతో ఆయన ప్రభుత్వ పథకం ఆరోగ్యశ్రీ ద్వారా తన సిఫారసు చేసి ఆపరేషన్ చేయించారు. వైద్యులు కొంత కాలంగా విశ్రాంతి తీసుకోవాల్సిందిగా సూచించారు. ఈ నేపథ్యంలో కష్టించి పనిచేసి వచ్చే ఆదాయంతో ఇల్లు గడుపుకునే ఆ కుటుంబం ఇబ్బందుల్లో పడింది. ఈ క్రమంలో కడవకుదురు ఎంపీటీసీ ఆమంచి వెంకట సుబ్బారావు ఆ కుటుంబానికి రూ. 25 వేల నగదు, నెల రోజులకు సరిపడా నిత్యావసర సరుకులు బుధవారం గఫూర్ ఇంటికి వెళ్ళి అందజేశారు. ఎంపీటీసీ కొండూరి గోవింద్, మాజీ ఎంపీపీ బోగిరెడ్డి వెంకట రమణారెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు మున్నం నాగేశ్వరరెడ్డి, పల్లపోలు లక్ష్మీనారాయణ, కో ఆప్షన్ సభ్యులు షేక్ మహ్మద్ బాష, నల్లమోపు సుబ్బారెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ గెల్లి వెంకట లక్ష్మీనారాయణ, మాజీ ఉప సర్పంచ్ అనుమాలశెట్టి రామకృష్ణ, రామ్‌లక్ష్మణ్‌లు, వాటుపల్లి బలరామయ్య తదితరులు పాల్గొన్నారు.

10న మెగా కంటి వైద్య శిబిరం

చీరాల: పెదకాకాని శంకర కంటి ఆసుపత్రి సహకారంతో ఈనెల 10న ఉచిత మెగా కంటి వైద్యశిబిరాన్ని పట్టణంలోని ఎస్‌వీఎస్ అండ్ ఎస్‌జేఆర్ ఆర్యవైశ్య కల్యాణ మండపంలో నిర్వహిస్తున్నామని ప్రతినిధులు శీరాం సురేష్, మంచికంటి వెంకటేశ్వరరావు తెలిపారు. ఉచిత కంటి వైద్యశిబిరానికి వచ్చే వారికి ఉచితంగా వైద్య పరీక్షలు చేసి అవసరమైన వారికి కంటి శస్త్ర చికిత్సలు నిర్వహిస్తున్నారని తెలిపారు. వివరాలకు 9951154728 నంబరును సంప్రదించాలన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో లాభం



తోటవారిపాలెంలో అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

చీరాల టౌన్: ప్రకృతి వ్యవసాయ పద్ధతులను అవలంబించడం వలన రైతులకు సాగు ఖర్చులు తగ్గడంతో పాటుగా ఆదాయం పుష్కలంగా కలుగుతుందని వ్యవసాయ సలహామండలి చైర్మన్ కె.రమణారెడ్డి సూచించారు. బుధవారం తోటవారిపాలెం పంచాయతీలో ప్రకృతి వ్యవసాయ పద్ధతుల ద్వారా క్యారెట్, బీట్‌రూట్, ముల్లంగి పంటలు సాగుచేసుకునే విధానంపై రైతులకు అవగాహన కల్పించారు. అలానే రక్షణ పంటలుగా జొన్న, సజ్జ, బెండ, చిక్కుడు, టమోటా పంటలు సాగు చేసుకుంటే కలిగే ఆర్థిక ప్రయోజనాల గురించి ప్రకృతి వ్యవసాయ సిబ్బంది సూచనలు చేశారు. చైర్మన్ మాట్లాడుతూ పోషకాహర ఉత్పత్తులు పండించవచ్చన్నారు. సిబ్బంది వెంకటేశ్వర్లు, మంజుల, శిరీష, కవిత, పద్మజ, పావని, రైతులున్నారు.

విద్యార్థులు క్రమశిక్షణతో ఉన్నతస్థాయికి చేరాలి



బహుమతులు అందజేస్తున్న రిమ్స్ మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సీహెచ్ సుధాకర్, ఐఎంఏ అధ్యక్షుడు జూలాది

ఒంగోలు సెంట్రల్: విద్యార్థులు క్రమశిక్షణతో విద్యనభ్యసించి ఉన్నత స్థాయికి చేరాలని రిమ్స్ మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సీహెచ్ సుధాకర్ పిలుపునిచ్చారు. జాహ్నవి నీట్ అకాడమీ ఫ్రెషర్స్ డే వేడుకలను బుధవారం స్థానిక ఎన్‌టీఆర్ కళాక్షేత్రంలో అకాడమీ డైరెక్టర్ పి.జనార్దన్ అధ్యక్షతన నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న రిమ్స్ మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సీహెచ్ సుధాకర్ మాట్లాడుతూ విద్యార్థులు విద్యతో పాటు ఆరోగ్యం కాపాడుకుంటూ మానసిక ఉల్లాసం కోసం క్రీడల్లో కూడా పాల్గొనాలని కోరారు. ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు, క్రీడా పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందించారు. అనంతరం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో ఇండియన్ మెడికల్ అసోషియేషన్ అధ్యక్షుడు డాక్టర్ జూలాది మణిబాబు, ప్రిన్సిపాల్ చిత్ర, అధ్యాపక బృందం పాల్గొన్నారు.

శిద్దా సుధీర్‌కు అభినందనలు



శిద్దా సుధీర్‌కు అభినందనలు తెలుపుతున్న ఆర్యవైశ్య సంఘ నాయకులు

ఒంగోలు: టీటీడీ బోర్డు మెంబర్‌గా బాధ్యతలు స్వీకరించిన శిద్దా సుధీర్‌కుమార్‌ను ముండ్లమూరు నాయకులు బుధవారం స్థానిక శిద్దా సుధీర్ నివాసంలో కలుసుకుని అభినందనలు తెలిపారు. పులికొండ శ్రీనివాసరావు, అమరా శ్రీరామమూర్తి, శిఖాకొల్లి సుబ్బారావు, పులికొండ బ్రహ్మేశ్వరరావు, అమరా సురేష్, నరహరి నారాయణ పాల్గొన్నారు.

సరికొత్త గ్రామాలు.. జగనన్న కాలనీలు



కరవది బీసీకాలనీ జగనన్న లే అవుట్లో నిర్మించిన గృహాలు

ఒంగోలు రూరల్: సొంతిల్లు లేని పేద కుటుంబాల కోసం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఏర్పాటు చేసిన జగనన్న కాలనీలు సకల సౌకర్యాలతో సరికొత్త గ్రామాలుగా రూపుదిద్దుకుంటున్నాయి. గత ఎన్నికలకు ముందుగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిర్వహించిన పాదయాత్రలో సొంతిల్లు లేని పేద ప్రజల కష్టాలు తెలుసుకుని చలించిపోయారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన వెంటనే అర్హులైన పేదలకు ఇళ్లు కట్టించే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. అందుకోసం ప్రతి గ్రామంలో జగనన్న లే అవుట్లు ఏర్పాటు చేసి అర్హులందరికీ వాటిలో స్థలాలు కేటాయించి పట్టాలు పంపిణీ చేశారు. ఆయా స్థలాల్లో ఇళ్ల నిర్మాణాలు కూడా చేపట్టేలా చర్యలు తీసుకున్నారు. అన్ని సౌకర్యాలు కల్పించి లబ్ధిదారులు ఇళ్లు నిర్మించుకుని అక్కడే ఉండేందుకు అనుకూలంగా అవసరమైన పనులు చేపట్టారు. ప్రభుత్వ సహకారంతో పాటు బ్యాంకుల ద్వారా కూడా రుణాలు ఇప్పించారు. దీంతో ప్రతి గ్రామంలోని జగనన్న కాలనీ మరో గ్రామంగా రూపొందుతోంది. ఒంగోలు మండలంలోని రూరల్‌లో మొత్తం 17 లే అవుట్లకుగానూ కరవదిలో 5 లే అవుట్లు ఏర్పాటు చేశారు. రైల్వేకాలనీలో 60 ప్లాట్లు, ఈస్టుహరిజనవాడలో 68, బీసీకాలనీలో 178, రెడ్డిపాలెంలో 44 ప్లాట్లు, క్రిస్టియన్‌పేటలో 55 ప్లాట్లతో కరవది విస్తీర్ణం పెరిగిపోయింది. ఉలిచిలో బీసీకాలనీలో 62, ఎస్సీకాలనీలో 58, బొద్దులూరివారిపాలెంలో 18, దేవరంపాడు క్రిస్టియన్‌పేటలో 33 ప్లాట్లు, అంబేడ్కర్‌నగర్‌లో 13 ప్లాట్లు, గుండాయపాలెంలో 168 ప్లాట్లతో చిన్నపాటి గ్రామాలు ఏర్పాటయ్యాయి. చేజర్ల బీసీ కాలనీలో 46, ఎస్సీకాలనీలో 35, పాతపాడులో 16, యరజర్లలో 42 ప్లాట్లు ఏర్పాటు చేశారు. అన్నింట్లో తాగునీరు, విద్యుత్, డ్రైనేజీ, రోడ్లు, ఓవర్‌హెడ్ ట్యాంకులు ఏర్పాటు చేశారు. దీంతో ఆయా కాలనీలన్నీ ఇళ్ల నిర్మాణాలతో కళకళలాడుతున్నాయి.

పేదల సంక్షేమం పట్ల రాష్ట్రంలోని వైఎస్సార్ సీపీ ప్రభుత్వం, సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్తశుద్ధికి నిదర్శనంగా నిలుస్తున్నాయి.